



రంజాన్ వేళలు
ఇఫ్తార్(శుక్రవారం-6:33)
సహర్ (శనివారం-5:04)



చెట్ల మొదళ్లను తగులబెడుతున్న కూలీలు

ఆంధ్రజ్యోతి నిఘా

అడవిని అమ్మేశాడు!

● కలప అక్రమ రవాణాలో అటవీ అధికారి!

» జూలపల్లి అటవీ సెక్షన్ అధికారి ఆధ్వర్యంలో యథేచ్ఛగా కలప రవాణా
» నీలగిరి చెట్లను కొట్టి అమ్మిన వైనం
» ఆమన్‌గల్లు రేంజ్ పరిధిలో కలపను పట్టుకున్న అధికారులు
» గుట్టుచప్పుడు కాకుండా విచారణ

అటవీ అధికారుల తీరు కంచే చేను మేసినట్లు తయారయ్యింది.. అడవిని కాపాడాల్సిన అధికారులే కలప అక్రమ రవాణా చేయడం చర్చనీయాంశం అవుతున్నది. మహమ్మదాబాద్ రేంజ్ పరిధిలో గతంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నర్సరీని పెంచారు. అందులో నీలగిరితో పాటు పలు రకాల మొక్కలు ఏపుగా పెరిగాయి.. వాటిని రక్షించాల్సిన సెక్షన్ అధికారి అక్రమంగా అమ్మినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికే మూడు నుంచి ఐదు లారీల కలప అక్రమ రవాణా జరిగినట్లు అక్కడ ఉండే కూలీలు, అటవీ ప్రాంత శివారు రైతులు చెబుతున్నారు. కొన్ని నెలలుగా ఇక్కడి నుంచి కలప అక్రమ రవాణా జోరుగా సాగుతున్నది. ఇక్కడి నుంచి కలప లారీ వెళ్లాలంటే సెక్షన్ అధికారి చేయి తడపాల్సిందే. అదికూడా సారు చెప్పినంత ఇవ్వాలి.. పైఅధికారుల నుంచి అనుమతి తీసుకున్నామని చెప్పినా సారు మాత్రం వినరు.. కదా తన అనుమతి లేనిదే వారు ఎలా అనుమతిస్తారని హల్‌చల్ చేసి డబ్బులు వసూలు చేస్తారు. మామూళ్లు ఇస్తేనే కలప బండి ముందుకు కదులుతుంది. ఇదంతా మహమ్మదాబాద్ మండల పరిధిలోని జూలపల్లి సెక్షన్ అధికారి వ్యవహారం.

- మహమ్మదాబాద్ (ఆంధ్రజ్యోతి)

అటవీ శాఖ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండల పరిధిలోని జూలపల్లి అడవిలో వర్షకాలంలో 20 ఏకరాల్లో మొక్కలు పెంచాలన్న లక్ష్యంతో ముళ్ల పొదలు, ఇతర పనికిరాని చెట్లను తొలంగించి.. చదును చేయాలని జిల్లా అధికారులు ఆ రేంజ్ అధికారిని ఆదేశించారు. ఆ మేరకు జూలపల్లి అటవిలో చదును చేసేందుకు అనుమతించారు. ఇదే అదునుగా తీసుకొని సదరు సెక్షన్ అధికారి చదును చేసేందుకు బుల్డోజర్, జేసీబీలతో ఆఘమేఘాల మీద పనులు చేపట్టారు. నీలగిరి, ఇతర పెద్ద పెద్ద చెట్లను తొలగించి వాటిని అమ్మకానికి పెట్టారు. కలప రవాణా చేసేందుకు అక్కడి వ్యాపారులతో కలిసి సుమారు నాలుగు లారీల కలప అక్రమ రవాణా చేయించారు. వచ్చిన డబ్బులను జేబులో వేసుకున్నాడు. గత నాలుగు రోజుల కిందట మరో లారీలో నీలగిరి కలప రవాణ చేస్తుండగా ఆమనగల్లు అధికారులు ఆ రేంజ్ పరిధిలో పట్టుకొని లారీ డ్రైవర్‌ను విచారించారు.



పెట్రోల్ పోసేందుకు సిద్ధం అవుతున్న కూలీలు

ఈ కలప ఎక్కడి నుంచి వస్తున్నది? ఎక్కడ నరికారు? ఈ తతంగం ఎన్ని రోజుల నుంచి జరుగుతోందని అడిగి తెలుసుకున్నారు. వెంటనే ఆ కలప రవాణా చేస్తున్న లారీని అటవీ కార్యాలయానికి తరలించారు. మహబూబ్‌నగర్ జిల్లా అధికారులకు, మహమ్మదాబాద్ రేంజ్ అధికారికి సమాచారం ఇచ్చారు. దీంతో అధికారులు జూలపల్లి అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. జిల్లా అటవీ అధికారి, మహమ్మదాబాద్ రేంజ్ అధికారి పరిశీలించి ఈ ప్రాంతంలో ఎలాంటి పనులు చేయవద్దని, విచారణ పూర్తయ్యేంత వరకు కూలీలను కూడా ఇక్కడికి అనుమతించ వద్దని సదరు సెక్షన్ అధికారిని ఆదేశించారు. ఈ విషయాన్ని గోప్యంగా ఉంచి విచారణ చేస్తున్నారు. రాత్రికి రాత్రే అక్కడ వినియోగించిన జేసీబీలను, బుల్డోజర్స్‌ను లారీపై ఎక్కించి తరలించారు.

● ఆంధ్రజ్యోతి పరిశీలనలో పలు విషయాలు వెలుగులోకి..

జూలపల్లి అటవిలో జరిగిన విషయాలను తెలుసుకునేందుకు 'ఆంధ్రజ్యోతి' వెళ్లి పరిశీలించగా పలు విషయాలు బయటకు పొక్కాయి. అక్కడ తొలగించిన చెట్ల కొమ్మలను, మొదళ్లను గుర్తు పట్టకుండా మొత్తం పెట్రోల్ పోసి తగులబెట్టారు. చెట్లను నరికిన చోటును గుర్తు పట్టకుండా జాగ్రత్త తీసుకున్నారు. రాత్రి సమయంలో ఇదంతా జరగడంతో కొందరు చుట్టుపక్కల రైతులను కూడా సదరు సెక్షన్ అధికారి ఈ విషయాన్ని ఎవరికీ చెప్పొద్దంటూ బెదిరించినట్లు తెలిసింది. గురువారం ఓ వ్యక్తి 'ఆంధ్రజ్యోతి'కి సమాచారం ఇవ్వడంతో జూలపల్లి నర్సరీ, అటవీ ప్రాంతాన్ని పరిశీలించగా అక్కడ పెద్దపెద్ద నీలగిరి చెట్లను బుల్డోజర్‌తో తొలగించి, కలపను లారీల ద్వారా బయటకు తరలించారు. మిగిలిన చెట్ల అవశేషాలను పెట్రోలు పోసి తగలబెట్టారు. జిల్లా అటవీ అధికారులు, మహమ్మదాబాద్ రేంజర్ కూడా మూడు రోజుల కిందటనే పరిశీలించి ఎలాంటి పనులు చేయవద్దని ఆదేశించారు. కానీ వారి మాటలు ఏమీ పట్టించుకోకుండా గురువారం కూడా కొంతమంది కూలీలతో చెట్ల మొదళ్లను, కొమ్మలను పెట్రోల్ పోసి కాల్చివేయించారు. అంతటితో కాకుండా అక్కడ ఉన్న కలపను గ్రామస్థులకు చెప్పి వంట చెరుకు కోసం తీసుకెళ్లేందుకు అనుమతించారు. అక్కడి కట్టెలను ట్రాక్టర్ల ద్వారా తరలించే యత్నం చేశారు.

ఇదిలా ఉంటే, కలప రవాణా చేసిన లారీల యజమానులను కూడా ఈ విషయాన్ని ఎవరికీ చెప్పొద్దని గురువారం రాత్రి ఆ సెక్షన్ అధికారి బెదిరించినట్లు విశ్వసనీయ సమాచారం.

విచారణ కొనసాగుతోంది..

కలప రవాణాకు సంబంధించిన లారీ ఆమనగల్లు రేంజ్ పరిధిలో పట్టుబడిన ఘటనపై విచారణ సాగుతున్నది. కలప ఎక్కడి నుంచి వచ్చిందని ఇప్పటికే విచరాణ చేపట్టాం. మహమ్మదాబాద్ రేంజ్ అధికారి పూర్తిస్థాయి విచారణ చేసి వివరాలు ఇవ్వమని ఆదేశించాం. జూలపల్లి అటవీ ప్రాంతం నుంచి కలప వెళ్లిందా అన్నదానిపై విచారణలో తెలుతుంది. జూలపల్లి అటవిలో మొక్కలు నాటేందుకు సిద్ధం చేస్తున్న ప్రాంతంలో ఎలాంటి పనులు చేయవద్దని ఇప్పటికే ఆదేశించాం. ఆ తర్వాత చెట్ల కొమ్మలు, మొదళ్లపై పెట్రోల్ పోసి తగులబెట్టి, ఆనవాలు లేకుండా చేసిన విషయం తన దృష్టికి రాలేదు. అలా చేసినట్లు తెలితే కఠిన చర్యలు ఉంటాయి.

- సత్యనారాయణ, డీఎఫ్‌వో, మహబూబ్‌నగర్

రేపటి నుంచి ఒంటిపూట బడులు

» ఏప్రిల్ 9 నుంచి 17 వరకు ఎస్‌ఏ-2 పరీక్షలు

7



పేటలో బడిబాట పట్టిన విద్యార్థులు

అడుగంటిన భూగర్భ జలం

» నారాయణపేటలో 1.55 మీటర్ల లోతుకు పడిపోయిన నీటిమట్టం

6



సుద్దబండ తండాలో ఎద్దులకు వదిలిన ఎండిన వరి చేను

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

» డీటీడీవో ఛత్రునాయక్
» ఉత్సాహంగా స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలు

7



ఎంపికలను ప్రారంభిస్తున్న డీటీడీవో ఛత్రునాయక్, డీవైఎస్‌వో శ్రీనివాస్

నేడు హోలీ సంబురాలు



గడియారం చౌరస్తాలో కామదహనం కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ జానకి

» ఉత్సాహంగా కామదహనం

మహబూబ్‌నగర్ న్యూటౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా హోలీ సంబురాలు శుక్రవారం జరుపుకునేందుకు ప్రజలు సన్నాహాలు చేస్తున్నారు. హోలీ వేడుకల్లో రంగులు చల్లుకోవడం కోసం ముందస్తుగానే రకరకాల కలర్స్‌ను కొనుగోలు చేస్తున్నారు. ప్రజలకు అందుబాటులో పట్టణంలోని పలుషాపుల్లో రంగులను అమ్మకానికి ఉంచారు. గురువారం రాత్రి 10.36 గంటలకు కామదహనం నిర్వహించాలని విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో ఇప్పటికే నిర్ణయించారు. దీంతో పట్టణంలోని అన్ని బస్తీల్లో కామదహనం కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం ఉదయం 9గంటలకు పురాతన గ్రంథాలయం వద్ద ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయానికి విశ్వహిందు పరిషత్, బజరంగ్ దళ్, ఏబీవీపీ, ఆర్‌ఎస్‌ఎస్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, భజన మండలి సభ్యులు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం హోలీ సంబురాలను ప్రారంభిస్తారు. ఒంటిగంట వరకు మాత్రమే హోలీ సంబురాలు జరుపుకోవడానికి పోలీసులు అనుమతులు ఇచ్చారు.

● రసాయన రంగులతో..

సంబురాలలో సాంప్రదాయ రంగులు చల్లుకుంటే ఎలాంటి సమస్యలు ఉండవు. కానీ కొందరు సంతోషంతో రసాయనాలతో కూడిన రంగులను కూడా చల్లుకుంటారు. హోలీ ఆడుతున్నంత సేపు సరదాగా ఉన్నా అనంతరం కంటి, చర్మ సంబంధ వ్యాధులు అనేకం వస్తాయి. అందుకే సాంప్రదాయ రంగులతో హోలీ వేడుకలు నిర్వహించుకోవాలని విశ్వహిందు పరిషత్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మద్దియాదిరెడ్డి, నలిగేశి లక్ష్మీనారాయణ సూచిస్తున్నారు.

● అప్రమత్తమైన పోలీసు శాఖ

హోలీ వేడుకలు శుక్రవారం జరుపుకోవడానికి ప్రజలు సన్నద్ధం కావడం, మరోపక్క పవిత్ర రంజాన్ మాసం ఉండటంతో జిల్లా పోలీస్ శాఖ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లను చేస్తున్నారు. కామదహనం కార్యక్రమంలో ఎస్పీ జానకి పాల్గొన్నారు.



ఎస్‌వీఎస్ దేవునిగుట్టపై కాముడి దహనం చేస్తున్న ప్రజలు

కొరడా

» ఆస్తి పన్ను చెల్లించని వారిపై చర్యలు
» ఓ పాఠశాల ప్రిన్సిపాల్ గదికి తాళం.. మరో పాఠశాలకు నోటీసు
» 6 ఇళ్లకు నల్లా కనెక్షన్ కట్



భాష్యం పాఠశాల ప్రిన్సిపాల్ గదికి తాళం వేస్తున్న కార్పొరేషన్ అధికారులు

మహబూబ్‌నగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను వసూలు మూడోవంతు మాత్రమే వసూలు కావడం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరో 15 రోజుల్లో ముగుస్తుండటంతో కార్పొరేషన్ అధికారులు మొండి బకాయిదారులపై కొరడా ఝుళిపిస్తున్నారు. గురువారం రెండు పాఠశాలలపై చర్య లు తీసుకోగా మరో 6 ఇళ్ల నల్లా కనెక్షన్ కట్ చేశారు. అధికారుల ఆదేశాల మేరకు ఆస్తిపన్ను బకాయి ఉన్న పాఠశాలల వద్దకు వెళ్లిన అధికారులు ఓ పాఠశాల ప్రిన్సిపాల్ గదికి తాళం వేశారు. మరో పాఠశాలకు తాళం వేసే ప్రయత్నం చేశారు. నాలుగేళ్లగా రూ.2.55లక్షలు బకాయి ఉన్న భాష్యం పాఠశాల ప్రిన్సిపాల్ గదికి తాళం వేశారు. అదేవిధంగా రూ.3 లక్షలు బకాయి ఉన్న పంచవటి పాఠశాల వద్దకు వెళ్లిన కార్పొరేషన్ అధికారులు ప్రిన్సిపాల్ గదికి తాళం వేసే ప్రయత్నం చేయగా నేడు చెల్లిస్తామని పాఠశాల యాజమాన్యం కోరడంతో నోటీసుతో సరిపెట్టారు. 24 గంటల్లో చెల్లించని పక్షంలో చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. అదేవిధంగా ఆస్తిపన్ను బకాయి ఉన్న మరో ఆరు ఇళ్లకు సంబంధించిన నల్లా కనెక్షన్ కట్ చేశారు. ఇక పట్టణంలో మొండి బకాయిలు ఉన్న కమర్షియల్ భవనాలకు తాళం వేయడం, రెసిడెన్షియల్ భవనాలకు నల్లా కనెక్షన్ కట్ చేయడం చేస్తున్నారు. పలువురికి ఇప్పటికే నోటీసులు జారీ చేశారు.

మొండిబకాయిలపై కఠినంగా వ్యవహరించాలి

ఆస్తి పన్ను వసూలులో నిర్లక్ష్యం చేయడం సరికాదని, మొండి బకాయిదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్, స్పెషల్ ఆఫీసర్ శివేంద్రప్రసాద్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం మహబూబ్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయంలో మహబూబ్‌నగర్, జడ్చర్ల, భూత్పూర్ పురపాలిక అధికారులతో సమీక్ష నిర్వహించారు. మరో 15 రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా ఇంకా చాలావరకు ఆస్తిపన్ను పెండింగ్ ఉన్నదని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతో పాటు పెండింగ్ ఆస్తిపన్ను చెల్లింపులు వందశాతం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ అప్లికేషన్‌లు వందశాతం ఫీజు చెల్లించేలా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న అడిషనల్ కమిషనర్ శివేంద్రప్రతాప్

భూసేకరణను వేగవంతం చేయాలి

» కలెక్టర్ సిక్తా పట్నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేటటౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం భూసేకరణను వేగవంతం చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో ఎత్తిపోతల పథకం భూసేకరణ, కోస్గి రోడ్డు విస్తరణ పనులపై కలెక్టర్ రెవెన్యూ, నీటి పారుదల శాఖ, ఆర్‌అండ్‌బీ, మునిసిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మక్తల్, నారాయణపేట, నియోజకవర్గాలలో భూసేకరణ ప్రక్రియను అధికారులు సమన్వయంతో చేపట్టాలన్నారు. భూసేకరణ ప్రక్రియ ఎంత వరకు వచ్చిందని ఆమె అడిగారు. జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్‌షాలం స్పందిస్తూ జిల్లాలోని మక్తల్, నారాయణపేట నియోజక వర్గాల పరిధిలో మొత్తం 21 గ్రామాల్లో 556 ఎకరాల భూసేకరణ చేపట్టాల్సి ఉందని, ఇప్పటి వరకు 16 గ్రామాల్లో భూసేకరణకుగాను ప్రిలిమినరీ నోటిపికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. అయితే ఆ 16 గ్రామాలకు సంబంధించి మొత్తం 379.07 ఎకరాల భూసేకరణ చేపట్టాల్సి ఉంటుందన్నారు. మిగతా 5 గ్రామాల్లో భూసేకరణ ప్రాసెస్‌లో ఉందని ఆర్డీవో రాంచందర్‌నాయక్ తెలిపారు. అంతకు ముందు కోస్గి రోడ్డు విస్తరణ పనులు ఎంత వరకు వచ్చాయని కలెక్టర్ ప్రశ్నించగా కోస్గి పట్టణంలో మొత్తం 228 వ్యాపార, నివాస గృహాలు విస్తరణలో పోతున్నాయని, వాటిలో 139 సొంత స్థలాలు, 89 ఖాళీ స్థలాలు ఉన్నట్లు మునిసిపల్ కమిషనర్ నాగరాజు తెలిపారు. ట్రైనీ కలెక్టర్ గరీమా నరుల, ఆర్‌అండ్‌బీ డీఈ రాములు, పీఆర్ ఈఈ హిర్యానాయక్, ఇగిరేషన్ ఈఈలు ఉదయ్ శంకర్, బ్రహ్మానందం, డీఈఈలు సతీశ్, సురేశ్, కోస్గి తహసీల్దార్ బక్క శ్రీనివాస్ పాల్గొన్నారు.

మైలారం గుట్టను పరిశీలించిన అధికారులు



అదనపు కలెక్టర్ వాహనాన్ని అడ్డుకోబోయిన గ్రామస్థులు

బల్మూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : కొన్ని నెలలుగా మైలారం గ్రామానికి సమీపంలో ఉన్న గుట్టపై మైనింగ్ పనులను వ్యతిరేకిస్తున్నారు. గురువారం నాగర్‌కర్నూల్ అదనపు కలెక్టర్ అమరేందర్ పొల్యూషన్ బోర్డు సభ్యులతో కలిసి గుట్ట ప్రాంతాన్ని పరిశీలించారు. తిరుగు ప్రయాణంలో గుట్ట సమీపంలో ఉన్న శివాలయం వద్ద అదనపు కలెక్టర్ మాట్లాడుతారని మైలారం గ్రామస్థులు ఎదురుచూశారు. ఆయన వాహనాన్ని నిలుపకుండా వెళ్తుంటే అడ్డుకోబోయారు. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి గ్రామస్థులను అడ్డు తొలగించారు. దీంతో అదనపు కలెక్టర్ వెళ్లిపోయారు. ఆగ్రహించిన గ్రామస్థులు మైనింగ్ కాంట్రాక్టర్‌కు పోలీసులు రక్షణ కల్పిస్తున్నారని ఆరోపించారు. పనులను నిలిపివేసే వరకు పోరాటం కొనసాగిస్తామని మైనింగ్ వ్యతిరేక పోరాట కమిటీ గ్రామ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మైనింగ్ ప్రాంతాన్ని సందర్శించిన వారిలో పొల్యూషన్ బోర్డు సభ్యులు సురేంద్రబాబు, నాగేంద్రం, చైతన్యం, తహసీల్దార్ శ్రీకాంత్, అచ్చంపేట సీఐ రవీందర్ ఉన్నారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

» పరిశ్రమల శాఖ జేడీ ప్రతాప్‌రెడ్డి



డీపీవో పార్థసారథితో కలిసి సమీక్ష నిర్వహిస్తున్న జేడీ ప్రతాప్ రెడ్డి

మహబూబ్‌నగర్ న్యూటౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని పరిశ్రమల శాఖ జేడీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని పరిశ్రమల శాఖ కార్యాలయంలో డీపీవో పార్థసారథి, పరిశ్రమల శాఖ ఏడీ జ్యోతితో కలిసి ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన కింద గ్రామాల్లో లబ్ధిదారులను ఎంపిక చేసే ప్రక్రియలో భాగంగా పంచాయతీ కార్యదర్శుల వివరాలు పరిశ్రమల శాఖకు అందించాలన్నారు. 2023లో ఈ పథకం కింద 18 రకాల రకాల చేతి వృత్తుల కులాలకు రుణాలు మంజూరు చేయాలని కేంద్రం ఆదేశించిందన్నారు. ఈ రుణాల మంజూరు ప్రక్రియను నేరుగా ఢిల్లీ నుంచి అధికారులు పర్యవేక్షిస్తారన్నారు. వారు పంచాయతీ కార్యదర్శుల లాగిన్‌కు కనెక్ట్ అవుతారన్నారు. చాలా గ్రామాల్లో కార్యదర్శుల బదిలీలు జరగడంతో, బదిలీ జరిగిన కార్యదర్శికే లబ్ధిదారుడి వివరాలు వెళ్తాయన్నారు. డీపీవో పార్థసారథి మాట్లాడుతూ బదిలీల వివరాలను పరిశ్రమల శాఖకు అందిస్తామన్నారు. జేడీ మాట్లాడుతూ జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం (పీఎంఈజీపీ) ప్రధానమంత్రి ఉపాధి కల్పన ద్వారా 8వ తరగతి చదివిన నిరుద్యోగులకు పరిశ్రమలకు, సర్వీసింగ్ సెంటర్లకు 35శాతం సబ్సిడీతో 40 మందికి రుణాలు మంజూరు చేయాల్సి ఉండగా, నేటి వరకు 65 మందికి రూ.3.51 లక్షల రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి మరో 25 మంది నిరుద్యోగులకు రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

బాల్య వివాహం చేసిన వారిపై కేసు

గండీడ్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహం చేసిన వ్యక్తులపై కేసు నమోదైన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం.. మండలానికి చెందిన బాలికను దేవరకద్ర మండలానికి చెందిన రాజుతో ఈ నెల 2వ తేదీన వివాహం చేశారు. సమాచారం తెలుసుకున్న చైల్డ్ హెల్ప్‌లైన్ వారు మహమ్మదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలికను వివాహం జరిపించిన వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. బాల్య వివాహాలను చేసినా, పోత్సహించిన వారిపై కూడా చర్యలు ఉంటాయని ఎస్‌ఐ హెచ్చరించారు.

ఉపాధి కరువై.. పోషణ భారమై..



నసనూర్ మీదుగా కూలీలతో ప్రమాదకరంగా వెళ్తున్న వాహనం

గద్వాల/రాజోలి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలోని గద్వాల, ధరూర్, కేటీదొడ్డి, గట్టు మండలాల్లో ఉపాధి కరువై కూలీలు ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. ప్రతీ రోజు వందలాది మంది ఆలంపూర్ నియోజకర్గంలోని ఇటిక్యాల, మానవపాడు, ఎర్రవల్లి, అయిజ, శాంతినగర్ మండలాలకు వెళ్తున్నారు. బొలెరో, ట్రాలీ ఆటోలలో సామర్థ్యానికి మించి కూలీలు ప్రయాణం చేస్తున్నారు. దీంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలబారిన పడుతున్నారు. సోమవారం గద్వాల మండలంలోని జమ్మిచేడు దగ్గర 40 మందితో ప్రయాణిస్తున్న బొలేరో వాహనం ప్రమాదానికి గురై 31మంది గాయపడ్డారు. ఇందులో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. అదేవిధంగా మంగళవారం అయిజ మండలం కిష్టాపూర్ సమీపంలో ఆటో బోల్తా పడిన సంఘటనలో పలువురు గాయపడ్డారు.

సాగునీరు లేక..

గద్వాల నియోజవకర్గంలోని ధరూర్, కేటీదొడ్డి, గట్టు మండలాల్లో సాగునీరు అందకపోవడంతో యాసంగి వ్యవసాయం అంతంతమాత్రమే ఉంది. దీంతో పనులు లేక కూలీలకు పూటగడవడం కష్టంగా మారింది. దీంతో ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. అలంపూర్ నియోజకవర్గంలో మిరప, పత్తి ఇతర పంటలు అధిక విస్తీర్ణంలో సాగుచేశారు. దీంతో అక్కడ కూలీలకు డిమాండ్ ఉంది. దీంతో ఈ మూడు మండలాల కూలీలతో పాటు గద్వాల మండలంలోని పలు గ్రామాల కూలీలు నిత్యం వందలాది మంది వెళ్తున్నారు. ఒక్కో కూలీకి రోజుకు రూ.300 ఆటో కిరాయి రూ.50ల చొప్పున యజమాని చెల్లిస్తున్నాడు. దీంతో ఎక్కువ మంది కూలీలను తరలిస్తే డబ్బు అధికంగా వస్తుందని బొలేరో, ఆటో డ్రైవర్లు సామర్థ్యానికి మించి కూలీలను తీసుకువెళ్తున్నారు. దీంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అంతే కాకుండా ఉపాధి హామీ పనులు పూర్తి స్థాయిలో చేయించ లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్తున్నామని కూలీలు వాపోతున్నారు.

పూటగడవక వెళ్తున్నాం



గ్రామంలో ఉపాధి పనులు పెట్టలేరు. ఇంటి దగ్గర ఉంటే పూటగడవడం లేదు. ఉపాధి పనులు నడిచినా ఎప్పుడు పిలిచే వారినే పిలుస్తున్నారు. మమ్ములను పిలవడం లేదు. పనులు కూడ లేవు. అందుకే ఆటోలలో ఇతర ప్రాంతాలకు పోతున్నాం.

- పద్మ, కూలీ, చెనుగోనిపల్లి

స్పెషల్ డ్రైవ్ పెట్టాం

జమ్మిచేడు, అయిజలలో బొలేరో వాహనాలు బోల్తా పడటంతో స్పెషల్ డ్రైవ్ కోసం అధికారులను సిద్ధం చేశాం. తనిఖీలు చేసి జరిమానాలు విధిస్తాం. ప్రజలు కూడ సురక్షిత ప్రయాణాన్ని ఎంచుకోవాలి.

- వెంకటేశ్వర్‌రావు, జిల్లా రవాణాశాఖ అధికారి, గద్వాల

తనిఖీలు చేస్తున్నాం

రాజోలి పోలీస్ స్టేషన్ పరిధిలో చిన్నధన్వాడ, పెద్ద ధన్వాడ, నసనూర్, తదితర గ్రామాల్లో తనిఖీలు చేస్తున్నాం. ఎక్కువ మంది కూలీలను తరలిస్తున్న వారిని, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తున్న వారిని అదుపులోకి తీసుకుని జరిమానాలు విధిస్తున్నాం. ఇటీవల 10రోజుల వ్యవధిలో ఎనిమిది వాహనాలను పట్టుకుని జరిమానా విధించాము.

- జగదీశ్వర్, రాజోలి, ఎస్‌ఐ

అడుగంటిన భూగర్భ జలం

ఆందోళనలో అన్నదాతలు

» నారాయణపేట 1.55 మీటర్ల లోతుకు పడిపోయిన జలమట్టం

» జిల్లా వ్యాప్తంగా 70 వేల బోర్లు

» యాసంగిలో 1.27 లక్షల ఎకరాల్లో వరి సాగు

» బోర్లలో తగ్గిన నీరు.. ఎండుతున్న పంటలు



మొగల్‌మడ్కతండాలో వరి పైరులో మేకలను వదిలిన రైతులు



ఎండిన పంటను చూపిస్తున్న రైతు

నారాయణపేట, మార్చి13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా రోజు రోజుకు పెరుగుతున్న ఎండలతో భూగర్భ జలాలు తగ్గుతున్నాయి. ఎన్నడూ లేని విధంగా మార్చి నెలలో జిల్లాలో సాధారణ జలమట్టం కంటే 1.55 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు తగ్గాయి. కృష్ణానది నీటి పరివాహక ప్రాంతాలతో పాటు చెరువుల పరిసరాల్లో ఉన్న బోర్లలో కాస్త నీటిమట్టం ఆశాజనకంగా ఉండగా మిగతా ప్రాంతాల్లో బోర్లలో నీరు తగ్గింది. దీంతో యాసంగిలో ప్రస్తుతం వరి సాగు చేసిన రైతులకు అక్కడక్కడా బోరు నీరు అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని గుండుమాల్ మండలం అమ్లీకుంటలో భూగర్భ జలాలు 16 మీటర్ల లోతుకు పడిపోయాయంటే ఏమేరకు పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో సంగం బండ, భూత్పూర్, కోయిల్‌సాగర్ కింద జిల్లాలో ప్రస్తుతం 24వేల ఎకరాల వరి సాగయ్యింది. దీంతో ఆయా నీటి వనరులు వరి పంటకు అందుతుండడంతో ప్రస్తుతానికి ఇబ్బంది లేదని ఆయకట్టు రైతులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 70వేల బోర్లు, 500 వరకు చెరువులు, కుంటలు ఉన్నాయి. కుంటలు ఎండిపోగా, చెరువుల్లో నీరు ఉండడంతో రైతులు యాసంగి పంటలు సాగు చేశారు. ప్రస్తుతం వరి పొట్ట దశలో ఉండడంతో నెలాఖరులోపు రెండు, మూడు తడులు నీరు అందితే ఏప్రిల్‌లో కోతలకు వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా యాసంగిలో ప్రస్తుతం 1.27లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ నెల 11న ధన్వాడ మండలం మందిపల్లిలో రైతు నర్సింహులు సాగుచేసిన నాలుగు ఎకరాల వరి పంటను కలెక్టర్ సిక్తా పట్నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ పరిశీలించారు. ఎకరా వరకు పంట ఎండిపోయిందని, బోర్లలో నీటిమట్టం తగ్గుతుందని రైతు కలెక్టర్ ఎదుట వాపోయాడు. జిల్లాలో పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని వ్యవసాయశాఖ అధికారులకు కలెక్టర్ సూచించడంతో వరి పంటలను పరిశీలించనున్నారు. దామరగిద్ద మండలం మొగల్‌మడ్కతండాలో బోర్లలో నీరు తగ్గడంతో దాదాపు వంద ఎకరాల వరి ఎండుతుందని రైతులు చెబుతున్నారు. వేసవిలో బోర్ల కింద ఈసారి అధికంగా వరి ఎందుకు సాగు చేశారని రైతులను ప్రశ్నిస్తే సాగులో భూమి ఉంటేనే రైతుబంధు వస్తుందని ఆశతో సాగు చేశామని చెబుతున్నారు. ఎండిన వరి పంటను మేకలకు, పశువులకు మేతగా వదిలినట్లు తండావాసులు తెలిపారు.

మూడు ఎకరాల్లో వరి ఎండింది



జిల్లాలోని దామరగిద్ద మండలం సుద్దబండ తండాలో నా రెండు బోర్లలో భూగర్భజలాలు తగ్గి ఒక బోరు ఎండిపోయింది. ఇంకో బోరులో నీరు పూర్తిగా తగ్గిపోయింది. ఆరు ఎకరాల్లో వరి సాగు చేస్తే, మూడు ఎకరాలు ఎండిపోయింది. పశువులకు మేతగా వదిలేశాను. మిగతా మూడు ఎకరాల పొలం పొట్ట దశలో ఉండడంతో చేతికి వస్తుందో రాదో తెలియని పరిస్థితి ఉంది.

- ధన్‌రాజ్, సుద్దబండతండా, రైతు



పూజలు చేస్తున్న ఆలయ అర్చకులు

భక్తిశ్రద్ధలతో రామలింగేశ్వరుడి ప్రభోత్సవం

మూసాపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం కందూరు రామలింగేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం మూడో రోజు పార్వతీ సమేత రామలింగేశ్వరుడికి ప్రభోత్సవ ఆశ్వావాహన సేవ నిర్వహించారు. వాస్తుపూజ, నిత్యోపాసన, నిత్యబలిహరణ, స్వామి వారికి విశేషంగా మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమం అర్చకులచే ఘనంగా నిర్వహించారు.

ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



అలంకరణలో స్వామి, అమ్మవారి విగ్రహాలు

మహబూబ్‌నగర్ రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వర స్వామివారి సన్నిధిలో ఉన్న అలివేలు మంగమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలు బుధవారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమయ్యాయి. అమ్మవారికి ధర్మకర్త అలహరి మధుసూదన్‌కుమార్ హోమం నిర్వహించారు. అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి సేవా కార్యక్రమాలను చేపట్టారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ బోధన

» రేపటి నుంచి ప్రారంభించనున్న మంత్రి జూపల్లి

» ఏర్పాట్లను పరిశీలించిన డీఈవో



చంద్రకల్ ప్రాథమిక పాఠశాలలో ఏఐ బోధన ముందస్తు తరగతులను పరిశీలిస్తున్న డీఈవో రమేష్‌కుమార్

పెద్దకొత్తపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని చంద్రకల్ ప్రాథమిక పాఠశాలలో 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఏఐ బోధన ఏర్పాట్లను డీఈవో ఏ.రమేష్‌కుమార్ గురువారం పరిశీలించారు. ఏఐ బోధనకు సిద్ధం చేసిన కంప్యూటర్లను తనిఖీ చేశారు. విద్యార్థులతో గణిత, తెలుగు పాఠాలను కంప్యూటర్ ద్వారా బోధన పద్ధతులను చూశారు. డీఈవో మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు ద్వారా 13 ప్రాథమిక పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) బోధన తరగతులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. చంద్రకల్ ప్రాథమిక పాఠశాలలో ఏఐ తరగతులను మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. అందుకు కావాల్సిన ఏర్పాట్లను పక్కాగా నిర్వహించాలని పాఠశాల హెచ్‌ఎంను డీఈవో ఆదేశించారు. కంప్యూటర్లు , అందుకు కావాల్సిన ఎలక్ట్రానిక్ పరికరాలతోపాటు పూర్తిస్థాయిలో ఇంటర్నెట్ సౌకర్యం తదితర ఏర్పాట్లును పక్కాగా చేసుకోవాలని సూచించారు. పెద్దకొత్తపల్లి మండలంలో పైలెట్ ప్రాజెక్టు ద్వారా చంద్రకల్, గంట్రావుపల్లి ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేసినట్లు తెలిపారు. డీఈవో వెంట జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి షర్ఫుద్దీన్, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అజాగ్రత్తతోనే ప్రమాదం

» ఎస్‌ఎల్‌బీసీ బాధిత కుటుంబాలకు రూ.2కోట్ల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

» పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్



దోమలపెంటలోని ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ వద్ద పౌర హక్కుల సంఘం నాయకులు

మన్ననూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఏళ్లుగా నిలిచిపోయిన ఎస్‌ఎల్‌బీసీ సొరంగం పనులను ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండానే ప్రభుత్వం తవ్వకాలు చేయడంతోనే ప్రమాదం జరిగిందని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్ విమర్శించారు. ఫిబ్రవరి 22న ఎస్ ఎల్‌బీసీ సొరంగం పనులు జరుగుతుండగా టీబీఎం యంత్రంపై ఆకస్మికంగా కొండ చరియలు కూలిన ఘటనలో ఎనిమిది మంది కార్మికులు చిక్కుకోగా, వారిలో పంజాబ్‌కు చెందిన గురు ప్రీత్ సింగ్ మృతదేహం లభించింది. ఈ ప్రమా ద ఘటనపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర, జిల్లా పౌరహక్కుల సంఘం నేతలు నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంటలోని ఎస్‌ఎల్ బీసీ సొరంగాన్ని గురువారం సందర్శించారు. మొదట కలెక్టర్ బదావత్ సంతోష్‌తో మాట్లాడి ప్రస్తుత సహాయక చర్యలను అడిగి తెలుసుకొని, ఎస్‌ఎల్ బీసీ ముఖద్వారం వద్దకు అనుమతి తీసుకొని వెళ్లారు. అక్కడ ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, హైడ్రా, అన్వి రోబో సహాయక బృందాలతో మాట్లాడి టన్నెల్‌లో తప్పిపోయిన వారిని వెలికి తీసేందుకు చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సొరంగం పనులు ఏ కారణంతో నిలిపివేశారో కాంగ్రెస్ ప్రభుత్వం అధ్యయనం చేయలేదన్నారు. మృతుడు గురుప్రీత్‌సింగ్ కుటుంబానికి ప్రభుత్వం రూ. 25 లక్షలు ఇస్తే సరిపోదని, బాధిత కుటుంబాలకు రూ. 2కోట్ల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కంపెనీ మరో రూ.కోటి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

'రాయితీ'పై అవగాహన కల్పించాలి

» ఉమ్మడి జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి రవీందర్

ఆత్మకూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఎల్ఆర్ఎస్ ఫీజులో 25 శాతం రాయితీని ఆయా గ్రామాల్లో, పట్టణ కేంద్రాల్లో అవగాహన కల్పించాలని ఉమ్మడి జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి రవీందర్ పేర్కొన్నారు. వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలోని సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్స్, రెవెన్యూ స్టాంప్ వెండర్స్, రియల్‌ఎస్టేట్ వ్యాపారులతో సబ్ రిజిస్టర్ ప్రకాశ్ ఆధ్వర్యంలో గురువారం సమావేశమయ్యారు. 2020లో తమ ప్రాపర్టీ నిమిత్తం ఎల్ఆర్ఎస్ ద్వారా బుకింగ్ చేసుకున్నవారు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు 25 శాతం రాయితీతో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. అలాగే 2020 కంటే ముందు లింకు డాక్యుమెంట్స్ కలిగిన వారు కూడా రాయితీతో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. రెవెన్యూ స్టాంప్ వెండర్స్, డాక్యుమెంట్ రైటర్స్, రియల్ ఎస్టేట్ యజమానులు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ అవకాశం ఈనెల 31వ తేదీ వరకు ఉందన్నారు. కార్యక్రమంలో ఆశన్న, ప్రభాకర్ రావు, తమ్మలి విజయ్, చక్రధర్‌గౌడ్, విజయ్‌కుమార్ పలువురు పాల్గొన్నారు.

వివాదాస్పదం.. పోలీసుల తీరు

» ఇష్టానుసారంగా విధుల నిర్వహణ

» ఇసుక, మట్టి, రేషన్ బియ్యం రవాణాకు సహకారం

» ప్రతీ కేసులో ఏకపక్షంగా వ్యవహారం

» తలపట్టుకుంటున్న పోలీస్ బాస్



పోలీస్ అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్ (ఫైల్)

వనపర్తి క్రైమ్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతిభద్రతలు పర్యవేక్షించే పోలీస్ శాఖ గాడి తప్పుతోంది. ఈ శాఖలో కొంతమంది అధికారులు, ఉద్యోగుల తీరు వివాదాస్పదం అవుతోంది. సొంత లాభం కోసం అధికారాలను దుర్వినియోగం చేస్తున్నారు. విధి నిర్వహణలో గాడి తప్పే వారిపై ఎస్పీ రావుల గిరిధర్ వేటు వేస్తున్నా మిగతా వారిలో మార్పు రావడం లేదు. స్టేషన్లకు వచ్చే ప్రతీ ఫిర్యాదుదారుడితో చేతులు తడపనిదే పని చేయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో ఇసుక, మట్టి, రేషన్ బియ్యం అక్రమ రవాణాలో కొంతమంది పోలీసు అధికారులు తమ కనుసన్నల్లో శాసిస్తున్నారు.

మార్క్ చూపిస్తున్న ఎస్పీ

ఎస్పీగా రావుల గిరిధర్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తన మార్క్ చూపుతున్నారు. బాధ్యతలు చేపట్టిన 8 నెలల నుంచి పోలీసు అధికారులు, సిబ్బందితో ప్రతీ నెల నేర సమీక్ష పెట్టడం, పోలీస్ స్టేషన్లను సందర్శించడం, ఆకస్మిక తనిఖీలు చేస్తూ సిబ్బందిని అలర్ట్ చేస్తున్నారు. జిల్లాలో రెండు ఘటనలు చిన్నంబావి మండలం లక్ష్మీపల్లిలో శ్రీధర్‌రెడ్డి హత్య ఉదంతం, పెబ్బేరు గోదాం దగ్ధం ఘటన మినహాయిస్తే జిల్లాలో జరిగిన మిగతా నేరాలు, హత్యలు, దారి దోపిడీలు, చోరీల కేసులను పకడ్బందీగా వ్యూహాత్మకంగా ఛేదించి తన మార్కు చూపిస్తున్నారు.

వేటు వేస్తున్నా.. మార్పు రాలే

ప్రతీనిత్యం కిందిస్థాయి అధికారులతో పాటు సిబ్బందితో ఎస్పీ టెలికాన్ఫరెన్స్, సమీక్షలు నిర్వహిస్తూ వస్తున్నారు. అక్కడక్కడా పోలీస్ శాఖకు భంగం కలిగించే విధంగా ప్రవర్తించిన అధికారులతో పాటు సిబ్బందిపై కూడా చర్యలు తీసుకుంటున్నారు. అయినా ఆ శాఖలో కొందరి తీరు మాత్రం మారడం లేదు. గతంలో పాన్‌గల్ పోలీస్ స్టేషన్‌లో పని చేసిన ఎస్‌ఐ, కానిస్టేబుల్, ఖిల్లాఘణపూర్ కానిస్టేబుల్, శ్రీరంగాపూర్ కానిస్టేబుల్, ఏఆర్ కానిస్టేబుల్స్ విషయంలో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాకే చర్యలు తీసుకున్నారు. కిందిస్థాయిలో పని చేసే సిబ్బందిలో చలాకీగా ఉండే ఒకరిని నియమించుకుని ఆయా స్టేషన్ల ఎస్‌ఐలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులతో పాటు ఇసుక, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేసే వారితో చేతులు కలుపుతున్నారు. మొన్నటి వరకు కొత్తకోట పోలీస్ సర్కిల్‌లో పని చేసిన ఓ ఎస్‌ఐ ఏకంగా ఫిర్యాదుదారులనే భయబ్రాంతులకు గురి చేసి కేసులు చేయకుండా వదిలేసిన ఘటనలు ఉన్నాయి. ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లినా అతనిలో మార్పు రాలేదు. చివరికి పని తీరుపై మందలించడంతో నిందితులపై కేసులు చేసిన ఘటనలు ఉన్నాయి.

జిల్లాలో కొన్ని ఘటనలు

- పాన్‌గల్‌లో పని చేసిన ఓ ఎస్‌ఐ తన వాహనానికి అడ్డు వచ్చిన ఓ వాహనదారుడిపై కారు దిగి దాడికి పాల్పడ్డాడు. అప్పట్లో సీసీ ఫుటేజీ సోషల్ మీడియాలో వైరల్‌గా మారి మీడియాలో కూడా కథనాలు వచ్చాయి. ఎస్పీ విచారణ చేపట్టి జిల్లా కార్యాలయానికి అటాచ్ చేశారు.
- ఖిల్లాఘణపూర్‌లో ఓ కానిస్టేబుల్, నాగర్ కర్నూల్ జిల్లాలోని తన అత్తగారింటికి వెళ్లి తిరిగి మద్యం మత్తులో వస్తుండగా పోలీసులు వాహనాల తనిఖీ చేపడుతుండగా వారితో దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించాడు. విచారణ చేపట్టి అతడిని ఎస్పీ విధుల నుంచి తప్పించారు.
- శ్రీరంగాపూర్‌లో ఓ కానిస్టేబుల్ రియల్ ఎస్టేట్‌లో తోటి కానిస్టేబుల్స్, ఉన్నతాధికారులతో పెట్టుబడులు పెట్టించి దివాలా తీయడంతో చెప్పాపెట్టకుండా గణేష్ బందోబస్తు కోసం హైదరాబాద్ వెళ్లి తిరిగి రాలేదు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ఎస్పీ అతడిని సస్పెండ్ చేశారు.
- పాన్‌గల్‌లో విధులు ఓ కానిస్టేబుల్ రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టి నష్టం రావడంతో అప్పుల బాధ తట్టుకోలేక ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయాడు. అప్పట్లో ఈ వార్త జిల్లా వ్యాప్తంగా కలకలం సృష్టించింది. తిరిగి వారం రోజులకు అతడు ఇంటికి చేరుకోవడంతో విచారణ చేపట్టిన తరువాత ఎస్పీ అతడ్ని విధుల నుంచి తప్పించారు.
- గత నెలలో జిల్లాలో ఓ ఉన్నతాధికారి వద్ద గన్‌మన్‌గా పని చేసే కానిస్టేబుల్ పెబ్బేరు పట్టణంలో దుకాణం వద్ద మద్యం మత్తులో పలువురిపై దాడికి పాల్పడ్డాడు. బాధితులు ఫిర్యాదు చేయగా అతనిపై మూడు కేసులు నమోదయ్యాయి. విచారణ చేపట్టిన అనంతరం అతడిని సస్పెండ్ చేశారు. ఇదే కానిస్టేబుల్ తనను పెబ్బేరు ఎస్‌ఐ హరిప్రసాద్ వేధిస్తున్నాడని, నాలుగు రోజుల క్రితం బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్‌కు ఫిర్యాదు చేశారు.
- పెబ్బేరు ఎస్‌ఐగా పని చేస్తున్న హరి ప్రసాద్‌పై కొంతకాలంగా ఇసుక, రేషన్ బియ్యం అక్రమ రవాణా వ్యాపారులతో కుమ్మక్కై నెల వారి మామూళ్లు తీసుకుంటూ సహకరిస్తున్నాడని ఆరోపణలు వస్తున్నాయి. ఎస్‌ఐ అవినీతిపై బుధవారం బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ డీజీపీ జితేందర్‌కి ఫిర్యాదు చేశారు.
- కొత్తకోట సర్కిల్ పరిధిలోని ఓ మండల ఎస్‌ఐ అధికార పార్టీ యువ నాయకుడి కనుసన్నల్లో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ మండలంలో నెల రోజుల నుంచి వందల క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడుతుంది. ఇక్కడ ఇసుకతో పాటు మట్టి, రేషన్ బియ్యం అక్రమ రవాణా ఎస్‌ఐ కనుసన్నల్లోనే నడుస్తున్నాయి.

విచారించి చర్యలు తీసుకుంటాం

పెబ్బేరు ఎస్‌ఐపై అవినీతి ఆరోపణలు వచ్చిన మాట వాస్తవం. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పీడీఎస్, మట్టి, ఇసుక అక్రమ రవాణాను ప్రోత్సహిస్తే చర్యలు తీసుకుంటాం. ఇలాంటివి ఎవరికైనా తెలిస్తే సమాచారమిస్తే.. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.

- రావుల గిరిధర్, ఎస్పీ, వనపర్తి

క్రైం కార్నర్

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య


మధు (ఫైల్)

అలంపూర్ చౌరస్తా, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండలం, జోగుళాంబ రైల్వేస్టేషన్ సమీపంలో ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కలుగొట్ల గ్రామానికి చెందిన గొల్ల రాముడు, శివమ్మలకు ముగ్గురు సంతానం ఉన్నా రు. అందరిలో చిన్నవాడు మధు (17) గొర్రెల కాపరిగా పనిచేస్తున్నాడు. గురువారం ఓ పెళ్లికి హాజరైన మధు, రైల్వే హాల్ట్ సమీపానికి చేరుకొని సోదరుడు వాసుకు ఫోన్ చేసి, తాను చనిపోతున్నానని తెలిపాడు. వద్దు.. వద్దని అతడిని ఫోన్లో వారిస్తూనే వాసు స్టేషన్ వద్దకు చేరుకున్నాడు. కానీ మధు అప్పటికే రైలు పట్టాల మధ్యలో తల పగిలి మృతి చెంది ఉన్నాడు. యువకుడి ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

» వివాహం అయిన వారం రోజులకే దుర్ఘటన


కుమ్మరి రాజు (ఫైల్)

చిన్నచింతకుంట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : పెళ్లి ఇంట విషాదం చోటు చేసుకున్నది. వివాహం అయిన వారం రోజులకే జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ విషాద సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా, చిన్నచింతకుంట మండలంలోని పర్దిపూర్ శివారులో జరిగింది. ఎస్ఐ రాంలాల్‌నాయక్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పర్దిపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి రాజు (31)కు ఈనెల ఆరున వివాహమైంది. గురువారం సాయంత్రం ఆయన ద్విచక్రవాహనంపై లాల్ కోట గ్రామానికి వెళ్తున్నాడు. అదే క్రమంలో జమ్ములనాయక్ తండాకు చెందిన రమేశ్‌నాయక్ ద్విచక్రవాహనంపై తండాకు వస్తున్నాడు. పర్దిపూర్ శివారులో రెండు వాహనాలు ఎదురె దురుగా వస్తూ ఢీకొన్నాయి. ప్రమాదంలో కుమ్మరిరాజు తలకు బలమైన గాయమైంది. స్థానికులు హుటా హుటిన జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గం మధ్యలో మృతి చెందాడు. రమేశ్‌నాయక్ కూడా గాయపడ్డాడు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా

» ట్రాక్టర్, టిప్పర్ పట్టివేత

నవాబ్‌పేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్, టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ విక్రం తెలిపారు. మండల కేంద్రంలోని కొండాపూర్ చౌరస్తాలో గురువారం తెల్లవారుజామున పోలీసులు గస్తీ నిర్వహిస్తుండగా ఇసుక లోడ్‌తో వస్తున్న టిప్పర్‌ను ఆపి విచారించారు. కారుకొండ సమీపంలోని కిష్టారం వాగునుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించారు. అలాగే చాకల్‌పల్లి గ్రామంలో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. రెండు వాహనాలను స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కూలీ డబ్బుల పంపకంలో వివాదం

» సరిగా ఇవ్వలేదని వ్యక్తిపై దాడి

పాన్‌గల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : కూలీ డబ్బు పంపకాల్లో వివాదం చెలరేగడంతో ఓ వ్యక్తిపై మరో వ్యక్తి దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వనపర్తి జిల్లా, పాన్‌గల్ మండలంలోని చింతకుంట గ్రామంలో గురువారం ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రేడ్డు అగరయ్య, ఆరేళ్ల మహేశ్‌లు కలిసి కొన్ని సంవత్సరాల నుంచి కూలీ పనులు చేస్తూ, వచ్చిన డబ్బును సమానంగా పంచుకుంటున్నారు. గురువారం వెయ్యి రూపాయలను పంచుకునే విషయంలో వారిద్దరి మధ్య వివాదం జరిగింది.

తనకు సమాన భాగం ఇవ్వలేదంటూ మహేశ్ అగరయ్యపై దాడి చేయడంతో తలకు తీవ్ర గాయమైంది. ఈ విషయంపై బాధితుడి చెల్లెలు గోవిందమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

» కేంద్రాలను తనిఖీ చేసిన ఉన్నతాధికారులు


గద్వాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

మహబూబ్‌నగర్ విద్యావిభాగం/ నారాయణపేట/ గద్వాల సర్కిల్/ నాగర్‌కర్నూల్ టౌన్/ వనపర్తి రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. గురువారం ఇంటర్ మొదటి సంవత్సరం గణితం-1బీ, జంతుశాస్త్రం, హిస్టరీ పరీక్షలు నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని 36 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 10,599 మంది హాజరు కావాల్సి ఉండగా, 10,347 మంది విద్యార్థులు హాజరయ్యారు. 252 మంది పరీక్ష రాయలేదు. జనరల్ విద్యార్థులు 8,460 మందికి గాను, 8,296 మంది పరీక్ష రాశారు. 164 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 2,139 మందికి గాను, 2,051 మంది పరీక్ష రాశారు. 88 మంది హాజరు కాలేదు.

- నారాయణపేట జిల్లా వ్యాప్తంగా 16 పరీక్ష కేంద్రాల్లో 3,888 మంది విద్యార్థులకు, 3,762 మంది పరీక్ష రాశారు. 126 మంది గైర్హాజరయ్యారు. వారిలో జనరల్ విద్యార్థులు 3,290 మందికి గాను 3,187 మంది హాజరు కాగా, 103 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 598 మందికి గాను, 575 మంది పరీక్ష రాశారు. 23 మంది హాజరు కాలేదు. నారాయణపేట పట్టణంలోని నాలుగు పరీక్ష కేంద్రాలను జిల్లా కోఆర్డినేటర్ సుదర్శన్‌రావు తనిఖీ చేశారు.
- జోగుళాంబ గద్వాల జిల్లాలోని 14 కేంద్రాల్లో 3,808 మంది విద్యార్థులకు గాను, 3,659 (96 శాతం) మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. వారిలో జనరల్ 2,951 మందికి గాను, 2,858 (97 శాతం) మంది విద్యార్థులు పరీక్ష రాశారు. వృత్తి విద్యకు సంబంధించి 857 మందికి గాను, 801 (93.4 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారు. అలంపూర్, మానవపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను పరీక్షల నిర్వహణ జిల్లా కన్వీనర్ హృదయరాజు తనిఖీ చేశారు.
- నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 6,201 మంది విద్యార్థులకు 5,846 మంది పరీక్ష రాశారు. 355 మంది గైర్హాజరయ్యారు. అందులో జనరల్ విభాగంలో 4,454 మందికి గాను, 4,228 మంది పరీక్షకు హాజరయ్యారు. 226 మంది పరీక్ష రాయలేదు. ఒకేషనల్‌లో 1,747 మంది విద్యార్థులకు 1,618 మంది హాజరు కాగా, 129 మంది గైర్హాజరయ్యారు. కల్వకుర్తి, వంగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాలను ఇంటర్ విద్య జిల్లా నోడల్ అధికారి జి.వెంకటరమణ తనిఖీ చేశారు.
- వనపర్తి జిల్లా వ్యాప్తంగా 25 కేంద్రాల్లో 5,802 మంది విద్యార్థులకు గాను, 5,599 మంది పరీక్షలు రాశారు. 203 మంది గైర్హాజరయ్యారు. జనరల్‌లో 4,549 మంది హాజరు కావాల్సి ఉండగా 4,425 మంది పరీక్ష రాశారు. 124 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ 1,253 మందికి గాను, 1,174 మంది హాజరయ్యారు. 79 మంది గైర్హాజరయ్యారు.



అంతరిక్ష కేంద్రం చూసొద్దాం రారండి!

- » ఇస్రో ఆధ్వర్యంలో యువ విజ్ఞాన కార్యక్రమం (యువికా)
- » అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన కల్పించడమే లక్ష్యం
- » 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు
- » ఈనెల 23 లోగా దరఖాస్తులకు అవకాశం


వనపర్తి బాలికల ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థులు (ఫైల్)

వనపర్తి రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : అంతరిక్ష కేంద్రాలను చూసొద్దాం రారండని 'ఇస్రో' పిలుస్తోంది. భారత అంత రిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తోంది. అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా యువ విజ్ఞాన కార్యక్రమం (యువికా) - 2025 ప్రకటించింది. అంతరిక్ష విజ్ఞానం, పరిశోధనలు, ఖగోళశా స్త్రాలపై విద్యార్థులకు ప్రాథమిక అవగాహన కల్పించి, వారిలో స్ఫూర్తిని నింపేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అందుకోసం ఆసక్తిగల విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నది. ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని వనపర్తి జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు తెలిపారు.

దరఖాస్తు చేసుకోవడం ఇలా..

ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్లో www.isro.gov.in లేదా jigyasa.iirs.gov.in/yuvika పోర్టల్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అందుకోసం సైట్ ఓపెన్ చేసి, యువికా ఆప్షన్ క్లిక్ చేయాలి. అందులో విద్యార్థికి సంబంధించిన పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలి. 8వ తరగతి వచ్చిన మార్కుల ఆధారంగా 50 శాతం వెయిటేజీ ఇస్తారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి 10 శాతం వెయిటేజీ ఉంటుంది. స్పేస్ సైన్స్ క్లబ్‌లో నమోదయి ఉంటే ఐదు శాతం, ఎన్ సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో ఉంటే ఐదు శాతం, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 20 శాతం వెయిటేజీ ఇస్తారు.

అంతరిక్ష కేంద్రాల సందర్శన

ఇస్రో నిర్వహిస్తున్న యువికా - 2025కి ఎంపికైన విద్యార్థులతో పాటు వారి కుటుంబ సభ్యుల్లో ఒక రికి అంతరిక్ష పరిశోధన కేంద్రాన్ని సందర్శించే అవకాశం కల్పిస్తారు. కేరళలోని తిరువనంతపురం, ఆంధ్ర ప్రదేశ్‌లోని సూళ్లూరుపేట, ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రా డూన్, గుజరాత్‌లోని అహ్మదాబాద్, మేఘాలయలోని షిల్లాంగ్, కర్ణాటకలోని బెంగళూరు, హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ కేంద్రాలకు తీసుకెళ్తారు. 14 రోజుల పాటు శిక్షణ నిస్తారు.

అంతరిక్ష విజ్ఞానం, ప్రయోగాలు, పరిశోధనలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. ప్రముఖ శాస్త్రవేత్తలతో ముఖాముఖి, చర్చావేది కలు, ముఖ్యులతో సమావేశాల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. విద్యార్థులకు బస్సులు, రైళ్లలో ప్రయాణ రాయతీ, వసతి కల్పిస్తారు.

● ఈ నెల 23వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ
● వచ్చేనెల 7న ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల
● మే 18న విద్యార్థులకు ఆహ్వానం
● మే 19 నుంచి 30 వరకు యువికా - 2025 నిర్వహణ
● మే 31న కార్యక్రమం ముగింపు, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు

విద్యార్థులకు చక్కని వేదిక



ఇస్రో నిర్వహిస్తున్న యంగ్ సైంటిస్టు కార్యక్రమం విద్యార్థులకు చక్కని వేదిక. విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు చక్కని అవకాశం. ముఖ్యంగా యువ శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఇది మంచి అవకాశం. ఏమైనా సందేహాలు ఉంటే ఉపాధ్యా యులతో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు.

- శ్రీనివాసులు, జిల్లా సైన్స్ అధికారి, వనపర్తి

విద్యార్థులను ప్రోత్సహించాలి

ఇస్రో నిర్వహిస్తున్న యంగ్ సైంటిస్టు కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయోగం. అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన కలుగుతుంది. భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు స్ఫూర్తినిస్తుంది. కార్యక్రమానికి దరఖాస్తు చేసుకునేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాలి.

- అబ్దుల్ గని, ఇంచార్జ్ డీఈవో :



స్పోర్ట్స్ బాక్స్

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

» డీటీడీవో ఛత్రునాయక్ » ఉత్సాహంగా స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలు


ఎంపికలను ప్రారంభిస్తున్న డీటీడీవో ఛత్రునాయక్, డీవైఎస్‌వో శ్రీనివాస్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మహబూబ్‌న గర్ జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి ఛత్రునాయక్ అన్నారు. మోడల్ స్పోర్ట్స్, వాటర్ స్పోర్ట్స్ అకాడమీ (క్రీ డా పాఠశాలలో)లో ప్రవేశాలకు మహబూబ్‌నగర్ పట్టణంలోని డీఎస్ఏ స్టేడియంలో గురువారం నిర్వహించిన ఎంపిక కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మహబూబ్ నగర్, నారాయణపేట జిల్లాల్లో 4వ తరగతి చదువుతున్న గిరిజన బాల, బాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో ఆసక్తి ఉన్న గిరిజన విద్యార్థులకు స్పోర్ట్స్ స్కూల్‌లో చేరే అవకాశం ఉంటుందని తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. ఎత్తు, బరువు, పరుగుపందెం, స్టాండింగ్ బ్రాండ్ జంప్, ఫ్లెక్సీ బిలిటీ టెస్ట్, బాల్‌త్రో, వర్టికల్ జంప్ తదితర అంశాల్లో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమం లో ఏటీడీవో చిన్ననాయక్, హస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు పద్మ, రాజేందర్, కో చ్‌లు సునీల్, పర్వేజ్, అంజద్ పాల్గొ న్నారు.

రేపు అథ్లెటిక్స్ జిల్లా జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని స్టేడియంలో ఈనెల 15న అథ్లెటిక్స్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి శరత్‌చంద్ర, నిర్వహణా కార్యదర్శి ఆనంద్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, 16, 18, 20 సంవత్సరాల లోపు బాల, బాలికలు, మహిళ, పురుషుల జట్లను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన వారు ఈ నెల 23న హైదరాబాద్‌లో నిర్వహిం చనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ టోర్నీలో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు స్టేడియంలో మధ్యాహ్నం రెండు గంటలలోపు రిపోర్ట్ చేయాలని కోరారు. జనన ధ్రువీకరణపత్రం, ఆధార్ కార్డులు వెంట తీసుకురావాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో అసోసియేషన్ సభ్యులు, పీఈటీలు

మక్తల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : టెన్నికాయిట్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను గురువారం ఎంపిక చేశారు. నారాయణపేట జిల్లా, మక్తల్ పట్టణంలోని సాయిజ్యోతి ఉన్నత పాఠశాల మైదానంలో టెన్నికాయిట్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దీప ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. సీనియర్ మహిళలు, పురుషుల విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో అఖిల, గాయత్రి, స్వప్న, అఖిల, శ్రీలత, పల్లవి, స్వప్న, ఆకాష్, అరవింద్, అశోక్, అఖిల్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వారు వరంగల్ జిల్లా, హన్మకొండలో ఈ నెల 15 నుంచి 16 వరకు నిర్వహించనున్న పోటీల్లో పాల్గొననున్నారు. కార్యక్రమంలో విశ్రాంత పీఈటీ గోపాలం, షూటింగ్‌బాల్ జిల్లా అధ్యక్షుడు సత్య అంజనేయులు, ఉపాధ్యక్షుడు అంజయ్య, ప్రధాన కార్యదర్శి రమేశ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎండుతున్న వరి

- » చివరి ఆయకట్టుకు అందని సాగు నీరు
- » పంట తుది దశలో అన్నదాత అగచాట్లు
- » పశువుల మేతకు వదిలేస్తున్న రైతులు


ఉమిత్యాల శివారులో నీళ్లు లేక ఎండిపోయిన వరి పైరు

కేటీదొడ్డి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : వేసవి ఆరంభంలోనే అన్నదాతలకు కష్టాలు మొదలయ్యాయి. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేస్తున్న వరి పైర్లు ఎండిపోతున్నాయి. ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి 104 ప్యాకేజీ కాలువ ద్వారా వచ్చే నీరు కేటీదొడ్డి మండలంలోని ఉమిత్యాల, కొండాపురం, వెంకటాపురం, ఈర్లబండ, ఇర్కిచేడు, గువ్వలదిన్నె గ్రామాల పరిధిలోని చివరి ఆయకట్టుకు సాగు నీరు అందడం లేదు. దీనికి తోడు బోర్లు, బావుల్లో నీరు అడుగంటడంతో వరి పైర్లు ఎండిపోతున్నాయి. దీంతో చేసేదేమీ లేక పైర్లను పశువుల మేతకు వదిలేస్తున్నారు.

అప్పు చేసి పంటల సాగు

పంట చివరి దశలో సాగు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలు చేతికి అందే పరిస్థితి లేదని ఆందోళన చెందుతున్నారు. వారబందీ పద్ధతిలో నీరు విడుదల చేస్తున్నా పంటలకు పెద్దగా ఫలితం దక్కడం లేదు. కొందరు రైతులు కాలువపై మోటార్లు ఏర్పాటు చేసుకొని మోటర్ల ద్వారా నీటిని తమ పొలాలకు పారించుకుంటున్నారు. దీంతో 104 ప్యాకేజీ కాలువ ద్వారా వచ్చే నీరు చివరి ఆయకట్టు వరకు అండం లేదు.

అన్నదాతల ఆందోళన బాట

ఎండిపోతున్న వరి పైర్లను చూసి రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పంటలను కాపాడుకునేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోవడంతో ఆందోళన బాట పడుతున్నారు. ఇటీవల ఉమిత్యాల, కొండాపురం, వెంకటాపురం, ఈర్లబండ, ఇర్కిచేడు గ్రామాలకు చెందిన రైతులు అంతర్రాష్ట్ర రహదారిపై ధర్నా చేశారు. రాత్రి వేళ కాలువలపై ఉన్న మోటార్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ అల్లపాడు సబ్‌స్టేషన్ ఆపరేటర్‌తో వాగ్వాదానికి దిగారు. ఇదే విషయంపై కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించారు. కాలువపై మోటర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయాలని, చివరి ఆయకట్టు వరకు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందించారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి



ఉమిత్యాల శివారులో ఐదు ఎకరాల్లో వరి సాగు చేశాను. ప్రస్తుతం పంట చివరి దశలో ఉంది. ఈ సమయంలో ఎండిపోతే తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి 104 ప్యాకేజీ కాలువ చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించి పంటలను కాపాడాలి.

- సత్యనారాయణ. రైతు. ఉమిత్యాల

వచ్చేనెల 15 వరకు నీటిని వదలాలి



చివరి ఆయకట్టుకు వచ్చే నెల 15వ తేదీ వరకు సాగునీరు వదలాలి. ఈ సారి ఒక ఎకరం మాత్రమే వరి సాగు చేద్దామనుకున్నా, కానీ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని ప్రజాప్రతినిధులు చెప్పడంతో 4 ఎకరాల్లో సాగు చేశాను. కానీ సాగు నీరు అందే పరిస్థితి కనిపించడం లేదు. బోర్లలో కూడా నీరు అడుగంటడంతో పంట ఎండిపోతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలి.

- గాజుల కృష్ణారెడ్డి. రైతు. కొండాపురం


కొండాపురం శివారులో ఎండిపోయిన వరి పైరును పరిశీలిస్తున్న కలెక్టర్

వెంటనే సాగునీరు విడుదల చేయాలి

» కలెక్టర్ బీఎం సంతోష్ ఆదేశం

కేటీదొడ్డి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : రైతుల అభ్యర్థన మేరకు తక్షణమే 104 ప్యాకేజీ కాలువకు సాగునీటిని విడుదల చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. కేటీదొడ్డి మండలంలోని 104 ప్యాకేజీ కాలువను, గువ్వలదిన్నె, కొండాపురం, ఇర్కిచేడు, ఉమిత్యాల శివార్లలో ఆయకట్టు కింద సాగు చేసిన వరి పొలాలను గురువారం ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సాగునీటి పంపింగ్ స్టేషన్లు, పంపిణీ వ్యవస్థను పరిశీలించారు. కాలువల ద్వారా సరఫరా అవుతున్న నీరు చివరి ఆయకట్టు వరకు అందేలా సమతుల్యతను పాటించాలని అధికారులకు సూచించారు. ఎగువ ప్రాంతాల రైతులు కాలువ గట్టుపై ఏర్పాటు చేసుకున్న మోటార్లు, పంపుసెట్లను పరిశీలించారు. పంటలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుం టామని రైతులకు హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట ఇరిగేషన్ ఈఈ రహీముద్దీన్, వ్యవసాయశాఖ అధికారి సక్రియానాయక్, ఏడీఏ సంగీత లక్ష్మీ, విద్యుత్ శాఖ ఏడీ రమేశ్‌బాబు, మండల వ్యవసాయశాఖ అధికారి సాజిద్ రెహమాన్, వ్యవసాయ విస్తరణ అధికా రులు ఉన్నారు.

డీజిల్ చోరీకి యత్నం

అలంపూర్ చౌరస్తా, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు శివారులో గుర్తు తెలియని వ్యక్తులు డీజిల్ చోరీకి యత్నించారు. ఎస్ఐ మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పంచలింగాల గ్రామానికి చెందిన వాల్మీకి రాజు పుల్లూరు శివారులోని అమర్‌నాథ్‌రెడ్డి పొలాన్ని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో రాజు ట్రాక్టర్‌తో పొలం చదును చేసేందుకు వచ్చాడు. ఆ క్రమంలో ట్రాక్టర్ ఆపి పొలానికి నీరు పారిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు 30 లీటర్లవి రెండు డబ్బాలు తీసుకొని వచ్చారు. ట్రాక్టర్ వద్దకు చేరుకొని డీజిల్ తీసేందుకు యత్నించడంతో రాజు గమనించి గట్టిగా కేకలు వేశాడు. దీంతో వారు డబ్బాలను అక్కడే వదిలేసి పారిపోయారు. సంఘటనపై రైతు ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

రేపటి నుంచి ఒంటిపూట బడులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం/నారాయణపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత రోజురోజుకు అధికం అవుతుండటంతో ఈ నెల 15 నుంచి పాఠశాలకు ఒంటి పూట బడులు నిర్వహించనున్నారు. అందుకు పాఠశాల విద్యాశాఖ అధికారులు ఉత్తర్వు లు ఇచ్చారు. శనివారం నుంచి ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాలలు కొనసాగనున్నాయి. ఈ ఒంటిపూట బడులు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లోని 3228 ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, ప్రైవేట్ పాఠశాల, కార్పొరేట్ తదితర యాజమాన్యాల పాఠశాలల్లో అమలు కానుంది. ప్రభుత్వ, లోకల్‌బాడీ పాఠశా లల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం 12 గంటలకు అందించి, పాఠశాల నుంచి విద్యా ర్థులను వదిలి పెడతారు. ఈ నెల 21 నుంచి పది పరీక్షలు జరిగే కేంద్రాలు ఉన్న పాఠ శాలల్లో మాత్రం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాఠ శాలలు నిర్వహిస్తారు. వీరికి కూడా పాఠశాలల్లో 12.45 తర్వాత భోజనం అందిస్తారు.

ఏప్రిల్ 9 నుంచి ఎస్ఏ-2 పరీక్షలు: 1 నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థులకు వార్షిక పరీక్షలు (సమ్మెటివ్ అసెస్మెంట్ -2) ఏప్రిల్ 9 నుంచి 17 వరకు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నరసింహారెడ్డి పరీక్షల షెడ్యూల్ ప్రకటించారు. మరుసటి రోజునుంచి విద్యార్థులకు వచ్చిన మార్కులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. ఏప్రిల్ 23న పాఠశాలలకు అన్ని పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి విద్యార్థులకు ఆన్‌లైన్ ప్రోగ్రెస్‌కార్డు ఇవ్వాలి.

ఇంటర్వ్యూ..

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు

» మిషన్ భగీరథ ఏఈ శివతేజ

కోయిలకొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : వేసవిని దృష్టిలో పెట్టుకొని మండలంలో ఎక్కడా తాగునీటికి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు మిషన్‌భగీరథ ఏఈ శివతేజ తెలిపారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు వివరాలు వివరించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చేపట్టిన చర్యలు?

మండలంలోని శ్రీరామకొండ, కుస్మహ్మద్‌పల్లి, చందాపూర్ నీటిశుద్ధి కేంద్రాల్లో సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాం. ఏమైన లోపాలుంటే ముందే గుర్తించి, సరి చేస్తున్నాం.

నీటి పొదుపుపై అవగాహన కల్పిస్తున్నారా?

నీటిని పొదుపుగా వాడుకుంటే వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా ఉంటాయని ఇప్పటికే పలు గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించాం.

బోరు బావులు వాడుతున్నారా?

గ్రామ పంచాయతీలో ఉన్న బోరు బావులను అత్యవసరాల కింద గుర్తించడం జరిగింది. వేసవిలో ఇబ్బందులు వస్తే బోరుబావుల ద్వారా తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

లీకేజీలపై చేపట్టిన చర్యలు?

ఎక్కడైనా పైపులైన్‌లు లీకేజీ అయితే వెంటనే సరి చేస్తున్నాం. వాటర్ మెన్‌లతో తాగునీటి సమస్యలపై చర్చిస్తున్నాం.

వైభవంగా గరుడవాహన సేవ

హన్వాడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : రామకొండ తిరుమల నాథ స్వామి ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారికి గరుడవాహన సేవ నిర్వహించారు. రాత్రి ఎదురుకోళ్ల వైభవంగా జరిగాయి. శుక్రవారం కల్యాణం, రథోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలపారు.

పంటల పరిశీలన

దేవరకద్ర, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోప్లాపూర్‌లో రైతులు సాగు చేసుకున్న పంటలను తహసీల్దార్ కృష్ణయ్య, ఏవో రాజేందర్ అగర్వాల్ గురువారం పరిశీలించారు. బోర్లలో నీరు తగ్గడంతో పంటలు ఎండిపోవడంతో సమాచారం అందుకున్న వారు మూడెకరాల్లో పంట ఎండిపోయినట్లు గుర్తించారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన పది పరీక్ష పత్రాలు

దేవరకద్ర, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 21 నుంచి పదో తరగతి పరీక్షలు జరుగనుండటంతో గురువారం పరీక్షా పత్రాలు పోలీస్ స్టేషన్‌కు చేరినట్లు ఎంఈవో బాల్‌రాం తెలిపారు. దేవరకద్ర, కౌకుంట్ల మండలాలకు చెందిన 860 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

ఎంఈవోకు సన్మానం

మిడ్జిల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఎంఈవోగా బాధ్యతలు చేపట్టిన వెంకటయ్యను గురువారం టీపీసీసీ కో-ఆర్డినేటర్ కొప్పుల మధుతో పాటు పలువురు నాయకులు శాలువాతో సన్మానించారు. సమతా సైనిక్‌దళ్ జిల్లా అధ్యక్షుడు నందం, ఉపాధ్యక్షుడు రాము, మండల అధ్యక్షుడు అనిల్‌కుమార్, మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి తిరుపతి పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే బీజేపీ ధ్యేయం

మిడ్జిల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామాభివృద్ధే బీజేపీ లక్ష్యమని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి అన్నారు. గురువారం మండలంలోని రాణిపేటలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను బీజేపీ మండల అధ్యక్షుడు నరేష్‌నాయక్‌తో కలిసి ప్రారంభించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కోయిలకొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆచార్యపూర్‌లో ఎన్ఆర్ఈజీఎస్‌లో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు గురువారం కాంగ్రెస్ నాయకులు భూమి పూజ చేశారు. కాంగ్రెస్ నాయకులు హన్మంతు, దిలీప్‌కుమార్, గోపాల్, వెంకటేష్, శంకర్, గోవిందు, వెంకటయ్య, కొండన్న, వెంకటయ్య, ఆంజనేయులు, సత్తయ్య, జయరాం పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు శివయ్యను తొలగించాలి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ జిల్లా కో-ఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయుడు శివయ్యను తొలగించాలని ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. గురువారం కలెక్టరేట్ ముందు ధర్నా చేసి, ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేశ్, సంబు కిశోర్ మాట్లాడారు. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ జిల్లా కో-ఆర్డినేటర్‌గా పనిచేసేందుకు ప్రభుత్వ జీవో ప్రకారం లోకల్ బాడి మేనేజ్‌మెంట్ టీచర్లు అనర్హులు అన్నారు. కేవలం ఆ పోస్టుకు ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులే అర్హులన్నారు. అనంతరం కలెక్టర్ విజయేందిర బోయికి వినతిపత్రం అందించారు. అంతకుముందు డీఈవో ప్రవీణ్ కుమార్‌ను కలిశారు.



హన్వాడ పాఠశాలలో ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు



చిన్నచింతకుంట సాందీప పాఠశాలలో..

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

భూత్పూర్/హన్వాడ/కోయిలకొండ /చిన్నచింతకుంట/నవాబ్‌పేట/మూసాపేట మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. డీఈవోగా పూజ, ఎంఈవోగా రమ్యశ్రీ, కాంప్లెక్స్ హెచ్ఎంగా అవినాష్, హెచ్ఎంగా ఐషా ఫాతిమా, పీఈటీగా ఆయాన్‌తో పాటు 20 మంది విద్యార్థులు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. హెచ్ఎం దస్తయ్య ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అదే విధంగా హన్వాడ మండల పరిషత్ పాఠశాలలో నిర్వహించిన స్వయం పరిపాలన దినోత్సవంలో డీఈవోగా జుబీయాబేగం, ఎంఈవోగా ప్రశాంత్, హెచ్ఎంగా మాధవ్‌తో పాటు మరికొందరు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కోయిలకొండ మండల కేంద్రంలోని న్యూ బ్రిలియంట్ ఉన్నత పాఠశాలలో గురువా రం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. చిన్నచింతకుంట మండల కేంద్రంలోని సాందీప పాఠశాలలో డీఈవోగా ఫయాజ్, ఎంఈవోగా హర్షవర్ధన్, హెచ్ఎంగా గౌతమ్, పీఈటీగా సుజల్, రాహుల్ వ్యవహరించారు. నవాబ్‌పేట మండలం చెన్నారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల, అడ్డాకుల మండలం రాచాల ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.



కోయిలకొండ న్యూ బ్రిలియంట్ పాఠశాలలో..



భూత్పూర్ ప్రాథమిక పాఠశాలలో..

కవయిత్రి మొల్లకు ఘన నివాళి



కవయిత్రి మొల్లమాంబ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఆనంద్‌కుమార్ గౌడ్

మహబూబ్‌నగర్ న్యూటౌన్/పాలమూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : సమాజ శ్రేయస్సు కోసం తన జీవితాన్ని త్యజించిన కవయిత్రి మొల్ల అని మాజీ మునిసిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని గ్రీన్‌బెల్ట్‌లో కవయిత్రి మొల్ల జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. శ్రీకృష్ణదేవరాయల కాల సమయంలో ఆము రాసిన మొల్ల రామాయణం ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. ప్రశాంత్, కుమ్మరి సంఘం పెద్దలు బుగ్గన్న, రామచంద్రయ్య, ఎల్లప్ప, రాజశేఖర్, నాగప్ప, రవికుమార్ పాల్గొన్నారు. బీసీ సమాజ్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ కవయిత్రి మొల్ల విగ్రహానికి నివాళి అర్పించారు. సారంగి లక్ష్మీకాంత్, అశ్విని సత్యం, దుర్గేష్, శేఖర్, విశ్వనాథ్, శంకర్‌బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు. కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో కవయిత్రి మొల్ల జయంతిని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. బుగ్గన్న, రామచంద్రయ్య, ఎల్లప్ప, మల్లేష్, నాగప్ప, కొండల్, గోపాల్, రవికుమార్, మాసయ్య, వెంకటయ్య, బాలచందర్, రామచంద్రయ్య, రాములు పాల్గొన్నారు.

● జడ్చర్ల : రామయాణాన్ని తెలుగులో రచించిన కవయిత్రి మొల్ల జయంతిని పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద కుమ్మరి సంఘం నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నవనీత, కుమ్మర సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కొండల్, ఎల్ల ప్ప, కుమార్, ప్రవీణ్, శివదర్శన్, రవితేజ, రమే శ్, రాఘవేందర్, కృష్ణ, నాగరాజు, శ్రీను, మల్లేష్, జనార్దన్, గణేష్, తిరుమలేష్ పాల్గొన్నారు.



జడ్చర్లలో మొల్లమాంబ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కుమ్మర సంఘం నాయకులు

ఇఫ్తార్ విందు మతసామరస్యానికి ప్రతీక

» రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్

మహబూబ్‌నగర్ అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలున్న వారికి ఇచ్చే ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. మండలంలోని ధర్మాపూర్ జేపీఎన్సీఈ కళాశాలలో గురువారం సాయంత్రం ముస్లిం సోదరులకు కళాశాల చైర్మన్ కేఎస్ రవికుమార్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కళాశాల చైర్మన్ రవికుమార్ మాట్లాడుతూ కులమతాలకతీతంగా కలిసిమెలిసి జరుపుకుందామన్నారు. కళాశాల పిన్సిపాల్ డాక్టర్ కృష్ణమూర్తి, భాస్కర్‌రావు, మైనార్టీ నాయకులు అన్వర్‌పాష, అబ్దుల్ రహమాన్, మక్సూద్ హుస్సేన్, ఉర్దూ జర్నలిస్టులు రఫీక్ పటేల్, జకీ, షాహనాజ్, నయ్యూమ్, ఖయ్యూం పాల్గొన్నారు.

వచ్చే నెల 20 నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సార్వత్రిక విద్యా పీఠం ఓపెన్ స్కూల్ ద్వారా నిర్వహించే పది, ఇంటర్మీడియట్ పరీక్షలు ఏప్రిల్ 20 నుంచి 26 వరకు నిర్వహించనున్నట్లు డీఈవో ప్రవీణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి పరీక్షల షెడ్యూల్ విడుదలైనట్లు తెలిపారు ప్రతీ రోజు రెండు విడతల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ సైన్ అభ్యర్థులకు 26 నుంచి మే 3 వరకు ప్రాక్టికల్స్ ఉంటాయని తెలిపారు.

వినియోగదారుల హక్కులు పరిరక్షించాలి

మహబూబ్‌నగర్ టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారుల హక్కులను పరిరక్షించేందుకు కట్టుబడి పనిచేయాలని ధర్మం, రక్ష ఫౌండర్, బీజేపీ నాయకుడు చికోటి ప్రవీణ్ అన్నారు. ఈనెల 15న ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా జరిగే కార్యకమాల్లో పాల్గొవలసిందిగా జిల్లా వినియోగదారుల హక్కుల కమిషన్ చైర్మన్ మాడమోని చందు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మడుగు శివశంకర్, కమిషన్ రాష్ట్ర చైర్మన్ బాలరాజు హైదరాబాద్‌లో గురువారం కలిసి ఆహ్వానించారు. నేషనల్ చైర్మన్ నాగేశ్వరరావు, హరిదత్త, నరేందర్, క్రాంతి పాల్గొన్నారు.

బూర్గుల రామకృష్ణారావుకు నివాళి

జడ్చర్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : బూర్గుల రామకృష్ణారావు జయంతిని జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. కళాశాలలోని బూర్గుల రామకృష్ణారావు విగ్రహానికి ప్రిన్సిపాల్ సుకన్య పూలమాల వేసి, నివాళి అర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నర్మద, శ్రీనివాసులు, అధ్యాపకులు రాఘవేందర్, సదాశివయ్య, నందకిశోర్, మాధురి, సతీష్, నరసింహారావు, పుష్పలత, వెంకటయ్య, నాగరాజు, నాగలక్ష్మి, సులేమాన్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి

చిన్నచింతకుంట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతోందని మాజీ ఎమ్మెల్యే కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కురుమూర్తిలో గురువారం వీర హనుమాన్ యువజన సంఘం, దివంగత మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్‌రెడ్డి స్మారకార్థం నిర్వహించిన టోర్నమెంట్‌ను ఆమె ప్రారంభించారు. మొత్తం 28 జట్లు పాల్గొనగా, గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. వీరహనుమాన్ యువజన సంఘం రాజు నాయుడు, నాయకులు భాస్కర్‌గౌడు, జైపాల్‌రెడ్డి, తిరుపతి గౌడు, మోహన్, రామన్‌గౌడు పాల్గొన్నారు.



చక్కనిరాయి దగ్గర సమస్యలను గుర్తిస్తున్న సీపీఎం నాయకులు

సమస్యలపై సీపీఎం సర్వే

జడ్చర్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగంపేటలో గురువారం ప్రజా సమస్యలపై సీపీఎం క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు మాట్లాడుతూ లింగంపేటలో 150 మంది లబ్ధిదారులు డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా, కేవలం 32 మందిని మాత్రమే లబ్ధిదారుల జాబితాలో ఉన్నారన్నారు. గ్రామంలో డ్రైనేజీ, సీసీ రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులకు గురవుతున్నారని, వీధిలైట్లు, తాగునీటి సౌకర్యం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీతో పాటు పలు సమస్యలు గ్రామస్థులు ఎదుర్కుంటున్నారని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం గ్రామస్థులను సమీకరించి గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు సాయిలు, జగన్, యాదయ్య, శ్యాం సుందర్, నర్సిములు, విజయ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

● పాలమూరు : పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని సీపీఎం పట్టణ ప్రతినిధి బృందం ప్రభుత్వాన్ని కోరింది. గురువారం జిల్లా కేంద్రంలోని వీరన్నపేట, చక్కనిరాయి ఏరియా డబుల్ బెడ్‌రూం పరిసరాల్లో ప్రజల సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. డ్రైయినేజీ లేకపోవడంతో మురుగునీరు పారుతోందన్నారు. విద్యుత్ సరఫరా కోసం వైరు లేక అస్తవ్యస్తంగా ఉందన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బి.చంద్రకాంత్, కిల్లె గోపాల్, గోపాల్, మధు, రామకృష్ణ, సత్తయ్య కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌కు పాఠశాలల ఎంపిక

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : తరగతిలో వెనకబడ్డ విద్యార్థులకు నైపుణ్యాలు నేర్పేందుకు ఆర్టిఫిషయల్ ఇంటలిజెన్స్ (ఏఐ) కార్యక్రమం జిల్లాలో ఈనెల 15 నుంచి ప్రారంభించనున్నారు. ఇందుకు కోసం మొదటి విడతగా పది పాఠశాలను ఎంపిక చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పోలీస్‌లైన్ పాఠశాల, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల రాంనగర్, ఎంపీహెచ్ఎస్ ఉంద్యా ల, ఎంపీహెచ్ఎస్ ముచ్చింతల, ఎంపీహెచ్ఎస్ డోకూర్, ఎంపీహెచ్ఎస్ గోపన్‌పల్లి, ఎంపీహెచ్ ఎస్ రాచాల, ఎంపీఎహెచ్ఎస్ కన్మనూర్, ఎంపీహెచ్ఎస్ నెరేళ్లపల్లి, ఎంపీహెచ్ఎస్ బలుసుర్ గొండను డీఈవో ప్రవీణ్‌కుమార్ ఎంపిక చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మరో 30 పాఠశాలల్లో 17 నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు

విపత్తులు ఎదురైతే జాగ్రత్తగా తప్పించుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : విపత్తులు ఎదురైతే తీసుకోవల్సిన జాగ్రత్తలు, ఎలా తప్పించుకోవాలనే దానిపై ప్రజలకు వివరించాలని కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. గురువారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆపద మిత్ర జాతీయ విపత్తుల నివారణ కార్యకర్తలకు శిక్షణ చివరి రోజు కార్యక్రమంలో జాతీయ విపత్తు నివారణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 300 మంది వలంటీర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అధికారులు సంఘటన స్థలానికి చేరుకొనే లోగా పౌరులే స్వయంగా రక్షణ పద్ధతులు పాటిస్తూ ప్రాణ, ఆస్తి నష్టం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో నర్సింహులు, డీఎఫ్‌వో సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

జడ్చర్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ ద్వారానే నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి జంగయ్య మాదిగ డిమాండ్ చేశారు. జడ్చర్ల ఎంపీడీవో కార్యాలయం వద్ద గురువారం రెండో రోజు రిలే దీక్షలు కొనసాగాయి. జంగయ్యమాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేపడుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు మాదిగలతో పాటు ఉపకులాల సిద్ధంగా ఉన్నాయని హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగను కొందరు స్వార్థపరులు విమర్శించడం సిగ్గు చేటు అన్నారు. వారికి తగిన బుద్ధి చెపుతామన్నారు. కార్యక్రమంలో కొంగళి నాగరాజు, దగ్గుల బాలరాజ్, కరాటే శ్రీను, రాజు, అశోక్, జంగయ్య, ఆంజనేయులు, జంగయ్య, శ్రీకాంత్, శివ, రాజారాం, గోపాల్‌రావు పాల్గొన్నారు.

రిపోర్టులు సకాలంలో అందించాలి



కేక్ కట్ చేస్తున్న సూపరింటెండెంట్, ల్యాబ్ టెక్నీషియన్లు

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : రక్త పరీక్షల రిపోర్టులు సకాలంలో రోగులకు అందేలా చూడాలని జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్ ఆదేశించారు. గురువారం ల్యాబ్ టెక్నీషియన్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆసుపత్రిలోని సమావేశ మందిరంలో నిర్వహించిన వేడుకలకు ఆయన పాల్గొని, మాట్లాడారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు రోగ నిర్ధారణ ముఖ్యమని, అందులో ప్రముఖ పాత్ర పోషించేది ల్యాబ్ టెక్నీషియన్లేనని అన్నారు. కావున రిపోర్టులు ఆలస్యం చేయకుండా సకాలంలో వారి ఇవ్వాలన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్, జనరల్ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బాలశ్రీనివాస్, ఆర్ఎంవోలు డాక్టర్ జరీన, డాక్టర్ గణేష్, డాక్టర్ శిరీష, డాక్టర్ శ్వేత, ల్యాబ్ టెక్నీషియన్ యూనియన్ నాయకులు వెంకటేష్, కోటేశ్వర్‌రెడ్డి, కురుమూర్తి, ప్రవీన్ పాల్గొన్నారు.

పంటలు ఎండిపోకుండా చూడాలి

» మాజీ ఎమ్మెల్యే ఆల

భూత్పూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నియోజవర్గంలోని వివిధ మండలాల్లో భూగర్భ జలాలు అడుగంటడంతో పంటలు ఎండిపోతున్నాయని, అధికారులు స్పందించి సాగునీరు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా గురువారం నియోజవర్గంలోని వివిధ మండలాల రైతులతో ఫోన్‌లో మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పంటలు ఎండిపోకుండా కోయిల్‌సాగర్ ద్వారా సాగు నీరు ఇచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం కోయిల్‌సాగర్‌లో 20 ఫీట్ల నీరు ఉన్నా ఎందుకు సాగునీరు ఇవ్వడం లేదని నిలదీశారు. అంతకు ముందు భూత్పూర్ మునిసిపాలిటీలోని 10వ వార్డుకు చెందిన డీలర్ నర్సిములు అనారోగ్యంతో బాధపడటంతో ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు మురళీధర్ గౌడ్, గడ్డం ప్రేమ్‌కుమార్, రాకేష్‌కుమార్‌గౌడ్, రాములు, పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి నమూనా పరిశీలన

నవాబ్‌పేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేపల్లికి చెందిన ఇందిరమ్మ లబ్ధిదారులు గురువారం మహబూబ్‌నగర్ మండలం ఓబులాయపల్లిలో ప్రభుత్వం నిర్మించిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను కాంగ్రెస్ నాయకుడు వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో సందర్శించారు. ఇటీవల దేపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా ఎంపిక చేసిన విషయం తెలిసిందే. అయితే తమ గ్రామానికి ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఏకకాలంలో 97 మంది పేదలకు ఇళ్లు మంజూరు చేయడం పట్ల గ్రామస్థులు సంతృప్తి వ్యక్తం చేశారు. రాములు వెంకటేష్, అశోక్, బాలరాజు, శివ రాములు, జంగయ్య, రవి, యాదయ్య, మహేందర్, షఫీ, శేఖర్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

కేఎల్ఐ కాల్వలో పడి వృద్ధురాలి మృతి

మిడ్జిల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాడియాల గ్రామ శివారులోని కేఎల్ఐ కాల్వలో పడి వృద్ధురాలు మృతి చెందగా, గురువారం రాత్రి వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. కంచనపల్లి గ్రామానికి చెందిన పెంటమ్మ (85) వాడియాల గ్రామంలోని తన కూతురు ఇంటికి వచ్చి ప్రమాదవశాత్తు కేఎల్ఐ కాల్వలో పడి మృతి చెందినట్లు తెలిపారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తాం

జడ్చర్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలోని 2వ వార్డులో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల ప్రాంతంలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామని చైర్ పర్సన్ కోనేటి పుష్పలత అన్నారు. డబుల్ బెడ్‌రూం ప్రాంతంలో డ్రైనేజీ సమస్య ఉందని, మురుగునీరంతా రోడ్డుపైకి వస్తున్నాయంటూ వార్డు కౌన్సిలర్ బుక్క మహేష్ కౌన్సిల్ సమావేశంలో పాలకవర్గం దృష్టికి పలు పర్యాయాలు తీసుకొచ్చారు. ఈ మేరకు గురువారం కమిషనర్ లక్ష్మారెడ్డి సమస్యను పరిశీలించారు. మునిసిపాలిటీలోని 12వ వార్డులో ఎంపీడీవో కార్యాలయం సమీపంలో రోడ్డుకి అతిసమీపంలో వ్యాపారాలు నిర్వహిస్తున్న తీరును పరిశీలించి, వ్యాపారాలను వెనక్కి జరుపుకోవాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే 3వ వార్డులోని సరస్వతి కాలనీలోని రోడ్డు నెంబరు 4లో ఉన్న మునిసిపాలిటీ 10 శాతం భూమికి మునిసిపాలిటీ స్థలంగా పేర్కొంటూ నేమ్ బోర్డు పెట్టాలని సిబ్బందికి ఆదేశించారు. కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, బుక్క మహేష్, రఘురాంగౌడ్, సతీష్, శశికిరణ్, టౌన్ ప్లానింగ్ అధికారి మేఘన పాల్గొన్నారు.

ఏఈవోల ఐక్య వేదిక జిల్లా కమిటీ ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న అధికారులు

జడ్చర్ల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ వ్యవసాయ విస్తరణ అధికారుల ఐక్య వేదిక జిల్లా కమిటీని గురువారం మండలంలోని మల్లెబోయినిపల్లి రైతు వేదికలో ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతయ్య ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడిగా సురేష్, అసోసియేట్ అధ్యక్షుడిగా రమేష్‌నాయక్, ప్రధాన కార్యదర్శి ఎలియ, కోశాధికారిగా మణికంఠగౌడ్, కార్యవర్గ సభ్యులుగా ఆశ్రత్‌ఫాతిమా, నాగేశ్వరి, కల్పన, శంకర్, గౌస్ పాషా, శివ, శశిత, మౌనిక, భగత్, నవనీత ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా సంతోష్, మోహన్‌రెడ్డి వ్యవహరించారు.